ఆంధ్రజ్యోతి
andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.1 ; కనిష్ఠం 23.3



నిజామాబాద్
జిల్లా వార్తలు

బుధవారం 17 జూలై 2024





సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సీఎం సమావేశంలో పాల్గొన్న కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, జూలై 16: హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్వహించిన జిల్లా కలెక్టర్లతో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమావేశానికి జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు హాజరయ్యారు. మంగళవారం సీఎం రుణమాఫీ, ప్రజాపాలన, ధరణి, వ్యవసాయం, సీజనల్ వ్యాధులు, వన మహోత్సవం, మహిళా శక్తి, విద్యాశాఖ, లా అండ్ ఆర్డర్, భద్రత, యాంటి డ్రగ్ క్యాంపేయిన్ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని ఎక్కడ కూడా అర్హులకు అన్యాయం జరుగకుండా చూడాలని సీఎం సమీక్షలో కలెక్టర్లకు ఆదేశించినట్లు సమాచారం. ఈ సమావేశంలో సీపీ కల్మేశ్వర్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

డీఎస్సీ -2024 పరీక్షకు ఏర్పాట్లు

నిజామాబాద్ అర్బన్, జూలై 16: ఉపాధ్యాయ నియామకాల కోసం నిర్వహించే డీఎస్సీ 2024 పరీక్షకు జిల్లా విద్యాశాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 నుంచి ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే పరీక్షకు జిల్లా కేంద్రంలోని బోధన్ రోడ్‌లోగల ఏవీ ఎంటర్ ప్రైజెస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీసు బందోబస్తుతో పాటు జిరాక్స్ సెంటర్లను మూసివేయాల్సిందిగా కమిషనర్ ఆఫ్ పోలీస్ ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. మొదటి విడత ఉదయం 9గంటల నుంచి 11.30ల వరకు, రెండవ విడత మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30ల వరకు ఉంటుందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు రెండు గంటల ముందే కేంద్రానికి చేరుకోవాలని అభ్యర్థులను నిర్ణీత సమయానికి గంటన్నర ముందు నుంచే లోపలికి అనుమతించడం జరుగుతుందన్నారు. పది నిమిషాల ముందు గేట్లను మూసివేస్తామని అభ్యర్థులు హాల్‌టికెట్, ప్రభుత్వ గుర్తింపుకార్డు, బాల్‌పాయింట్ పెన్ వెంటతెచ్చుకోవాలని అన్నారు.



విద్యాశాఖలో.. బదిలీల పంచాయితీ!

- బదిలీ అయినా.. రిలీవ్ కాని ఉపాధ్యాయులు
- విద్యార్థులకంటే ఉపాధ్యాయుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలే అధికం
- మారుమూల ప్రాంతాలకు వెళ్లని ఉపాధ్యాయులు
- పదేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న వైనం



నిజామాబాద్ అర్బన్, జూలై 16: విద్యాశాఖలో ఇటీవల నిర్వహించిన బదిలీలు, పదోన్నతులు ఆశాఖకు కొత్త పంచాయితీలను తెచ్చి పెట్టింది. బదిలీలతో బోధనపరమైన ఇబ్బందులు తగ్గుతాయనుకుంటే వాటిద్వారా విద్యాశాఖ అధికారులకు కొత్త తలనొప్పులు మొదలయ్యాయి. బదిలీ అయినా.. ఉపాధ్యాయులు రిలీవ్ కాకపోవడంతో పదేళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్నవారు ఇబ్బందులు పడుతున్నారు. డీఎస్సీ నిర్వహించి కొత్త ఉపాధ్యాయులు వస్తే తప్ప.. సిరికొండ, ధర్పల్లి, భీంగల్, కమ్మర్‌పల్లి, మెండోరా తదితర దూరప్రాంత మండలాల్లో పదేళ్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రస్తుతం రిలీవ్‌కాని పరిస్థితి నెలకొంది. జిల్లాలో 1360 మంది ఉపాధ్యాయులు బదిలీ కాగా కేవలం 803 మంది మాత్రమే రిలీవ్ అయ్యాయి. మిగిలిన 557 మంది బదిలీలు అయినప్పటికీ ప్రస్తుతం పనిచేస్తున్న స్థానాల నుంచి రిలీవ్ కాలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలో 853 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు వచ్చాయి. ఎస్జీటీలకు బదిలీలు జరిగినప్పటికీ వారు రిలీవ్ కాకపోవడంతో ఇప్పుడు కొత్త తలనొప్పులు వస్తున్నాయి. దీంతో ఆ ఖాళీ స్థానాల్లో కూడా ఉపాధ్యాయులను భర్తీ చేయలేని పరిస్థితి నెలకొంది. బదిలీలు, పదోన్నతులు జరిగినప్పటికీ చాలా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు, ఉపాధ్యాయుల సంఖ్యకు పొంతనలేకుండా పోతుంది. ప్రభుత్వ బడులను హేతుబద్ధీకరించాలని ఇటీవల కేంద్ర విద్యాశాఖ రాష్ట్ర ప్రభుత్వానికి సూచన చేసింది. సమగ్ర శిక్ష ప్రాజెక్టు ఆమోదిత మండలి తెలంగాణ నుంచి అందిన వివరాలను విశ్లేషించిన కేంద్ర విద్యాశాఖ వివిధ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వానికి దిశ నిర్దేశం చేసింది. ఏకోపాధ్యాయ పాఠశాలను తప్పనిసరిగా హేతుబద్ధీకరించాలని సూచించింది. జిల్లాలో 13 పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడంతో వాటిని మూసివేయాల్సిన పరిస్థితి ఉంది. అలాగే జిల్లాలో ఏకోపాధ్యాయ పాఠశాలలు 208 ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ సూచనల ప్రకారం తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను ఎక్కువ మంది విద్యార్థులున్న చోటకి బదలాయించే అవకాశం ఉంది.

నిబంధనలు ఇలా..

హేతుబద్ధీకరణ ప్రక్రియలో పాఠశాలలు, విద్యార్థుల సంఖ్యను ప్రాతిపదికన తీసుకొని రెండు విధాలుగా చేశారు. ఈ మేరకు 2021లో జీవో 25 ద్వారా ఉత్తర్వులు ఇచ్చారు. అందులో పాఠశాలల విలీనానికి సంబంధించిన ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. ఈ ఉత్తర్వులను అప్పట్లో ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకించడంతో పాటు దాన్ని అమలు చేయలేదు. ఒకటి నుంచి పది మంది విద్యార్థులున్న పాఠశాలలకు ఒక పోస్టు, పదకొండు నుంచి నలభై మంది విద్యార్థులుంటే రెండు పోస్టులు, 41 నుంచి 60 మంది ఉంటే మూడు పోస్టులు, 60కి పైగా ఉంటే అన్ని పోస్టులను బదిలీలలో చూపాల్సి ఉంటుంది. కానీ ఇటీవల జరిగిన బదిలీలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పోస్టులను చూపలేదని ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల జరిగిన బదిలీలలో ఒకరకంగా అనధికార హేతుబద్ధీకరణ చేపట్టారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. బదిలీలలో అన్ని ఖాళీలను చూపలేదని దీనివల్ల సీనియారిటీ ఉన్న తమ సొంత మండలానికి వెళ్లలేని పరిస్థితి ఉందని ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. కొన్ని చోట్ల విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ ఉపాధ్యాయుల సంఖ్య ఎక్కువగా ఉన్న ఆ పాఠశాలలకు మళ్లీ బదిలీలలో ఉపాధ్యాయులను కేటాయించడంపై విమర్శలు వస్తున్నాయి.

ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఒకరే..

జిల్లాలో ఏకోపాధ్యాయ పాఠశాలలు 200కు పైగా ఉండగా అందులోను ఉపాధ్యాయులు కూడా ఇతర పాఠశాలలకు బదిలీ అయ్యారు. వీటికి అదనంగా పోస్టులను మంజూరు చేయకుండా ఒకరినే కేటాయించడంతో ఆ ఉపాధ్యాయుడు వెళితేనే పాఠశాల నడిచే పరిస్థితి నెలకొంది. ఒకవేళ ఉపాధ్యాయుడు సెలవుల్లో ఉంటే ఆ పాఠశాల నడిచే పరిస్థితి లేదు. ఆ ఉపాధ్యాయుడు సెలవులో ఉంటే ఇతర పాఠశాల నుంచి లేదా సీఆర్‌పీలను ఆ పాఠశాలలో ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది. ఏకోపాధ్యాయ పాఠశాలలను బలోపేతం చేయాల్సి ఉండగా తాజాగా జరిగిన బదిలీలలోను ఉపాధ్యాయులను కేటాయించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించాం..

: దుర్గాప్రసాద్, డీఈవో

జిల్లాలో ఇటీవల నిర్వహించిన బదిలీలు, పదోన్నతుల్లో ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేయడం జరిగింది. ఎక్కడైతే విద్యార్థులు ఎక్కువ, ఉపాధ్యాయులు తక్కువగా ఉన్న చోట అలాగే ఉపాధ్యాయులు ఎక్కువ, విద్యార్థులు తక్కువగా ఉన్నచోట ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే ఉన్నతాధికారులకు నివేదిస్తాం. సర్దుబాటు విషయంలో ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు.

విద్యార్థులు తక్కువ.. ఉపాధ్యాయులు ఎక్కువ

జిల్లాలో ఇటీవల జరిగిన బదిలీలు, పదోన్నతుల్లో ఉపాధ్యాయులు ఎక్కువగా, విద్యార్థులు తక్కువగా ఉన్నచోట మళ్లీ ఉపాధ్యాయులను కేటాయించడం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. మారుమూల ప్రాంతాల్లో ఉపాధ్యాయులకు బదిలీలు జరిగిన రిలీవర్ రాక వారు అక్కడి నుంచి ఇతర ప్రాంతాల్లోకి వెళ్లే పరిస్థితి లేకపోగా కొన్ని మండలాల్లో మాత్రం ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్యకు పొంతనలేకుండా ఉంది. దీంతో విద్యార్థులు ఎక్కువగా ఉన్న చోట ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉండగా ఇక్కడ మాత్రం దానికి విరుద్ధంగా పరిస్థితులు ఉన్నాయి. నందిపేట మండలం మారంపల్లి, నూత్‌పల్లి ఉన్నత పాఠశాలల్లో 30లోపు విద్యార్థులు ఉంటే పూర్తిస్థాయిలో అంటే 9 మంది ఉపాధ్యాయులు ఉండగా ఇటీవల బదిలీలలో అదనంగా మరొకరిని కేటాయించారు. మాక్లూర్ మండలం కొత్తపల్లి, గుంజలి, రాంచంద్రపల్లి, బోర్గాం(కె) ఉన్నత పాఠశాలల్లో 40 మందిలోపే విద్యార్థులు ఉండగా ఆ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో 9 మంది ఉపాధ్యాయులు ఉండగా మళ్లీ అదనంగా ఒక ఉపాధ్యాయుడిని కేటాయించారు. ఇలా జిల్లాలో అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్యకు విద్యార్థుల సంఖ్యకు పొంతనలేకుండా ఉన్నప్పటికీ బదిలీలలో కేటాయింపులు చేయడం విమర్శలకు తావిస్తోంది. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు సరైన విద్య అందడం లేదు.



- రాష్ట్రస్థాయి కార్పొరేషన్, జిల్లా పోస్టులపై నజర్
- ఎమ్మెల్యేలు, మంత్రుల ద్వారా పదవుల కోసం ప్రయత్నాలు
- నేరుగా సీఎంను కలుస్తూ అవకాశాలు ఇవ్వాలని కోరుతున్న నేతలు

'నామినేటెడ్'కు కాంగ్రెస్ నేతల ప్రయత్నాలు

నిజామాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నామినేటెడ్ పదవుల కోసం జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పోస్టులతో పాటు జిల్లా స్థాయి పదవులపై దృష్టిపెట్టి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, రాష్ట్ర మంత్రులను కలుస్తూ తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. పదేళ్ల పాటు తాము పార్టీకి చేసిన సేవలను వివరించడంతో పాటు నామినేటెడ్ పదవుల్లో అవకాశం ఇస్తే మరింత జోష్‌గా పనిచేస్తామని వివరిస్తున్నారు. కొంత మంది నేతలు నేరుగా సీఎంను కలిసి విజ్ఞప్తి చేస్తున్నారు. శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో తాము చేసిన కృషిని వివరిస్తూనే ఈ అవకాశం కల్పించాలని కోరుతున్నారు. రాష్ట్రస్థాయిలో అవకాశం లేకుంటే జిల్లాలోని కీలకమైన నామినేటెడ్ పదవుల్లో తమకు తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరుతున్నారు.

రాష్ట్రస్థాయిలో జిల్లాకు కీలక పదవులు..

రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల్లో జిల్లాకు చెందిన కీలక కాంగ్రెస్ నేతలకు అవకాశం కల్పించారు. వారికి తగిన అవకాశాన్ని ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా మాజీ మంత్రి షబ్బీర్ అలీకి అవకాశం ఇచ్చారు. కేబినెట్ హోదాను కల్పించారు. ఎమ్మెల్యేల కోటాలో పీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా తాహెర్‌బిన్ హుందాన్‌ను నియమించారు. వీరి తర్వాత రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్‌లో ముగ్గురు నేతలకు అవకాశం ఇచ్చారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా అన్వేష్‌రెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌కు అవకాశం ఇచ్చారు. మూడు నెలల తర్వాత ఉత్తర్వులు జారీ చేయడంతో వారు ఐదు రోజుల క్రితం బాధ్యతలను స్వీకరించారు. రాష్ట్రస్థాయి కార్పొరేషన్‌లో జిల్లాకు తగిన అవకాశం కల్పించడంతో సీనియర్ నేతలు ప్రయత్నాల్లో ఉన్నారు. కాంగ్రెస్‌లో కీలకంగా పనిచేసిన నేతలు పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. మరిన్ని రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల చైర్మన్ల నామినేటెడ్ పదవులను ప్రభుత్వం భర్తీ చేయనుండటంతో జిల్లాకు చెందిన కీలక నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్‌లో కీలకంగా ఉన్న ధర్మపురి సంజయ్, గడుగు గంగాధర్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, నగేష్‌రెడ్డి, కేశవేణు, శేఖర్‌గౌడ్, వేణుగోపాల్ యాదవ్‌లు తమకు రాష్ట్రస్థాయి పదవులు వస్తాయని భావిస్తున్నారు. కీలక నేతలను కలుస్తూ అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. రాష్ట్రస్థాయిలో అవకాశాలు కల్పిస్తే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మరింత కీలకంగా పనిచేస్తామని వివరిస్తున్నారు. ఎమ్మెల్యేలు, మంత్రుల ద్వారా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. కొంత మంది నేరుగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

జిల్లా స్థాయిలో ప్రయత్నాలు

జిల్లా స్థాయిలో నామినేటెడ్ పోస్టుల కోసం ఎక్కువ మొత్తంలో నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో ఏడు వరకు మార్కెట్ కమిటీలు ఉండటం వల్ల నియోజకవర్గాల వారీగా కీలక నేతలకు ఈ అవకాశాలు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ, నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవులకు కీలకమైన సీనియర్ నేతలకు అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం. రాష్ట్ర పీసీసీ అధ్యక్షుని నియామకం తర్వాత జిల్లాలో డీసీసీ అధ్యక్షునిగా కీలకమైన నేతకు అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటం వల్ల జిల్లా అధ్యక్షునిగా సీనియర్ నేతకే అవకాశం ఇవ్వనున్నట్లు పార్టీ నేతలు తెలిపారు. నాలుగేళ్ల పాటు పనిచేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో సమర్థవంతంగా పనిచేసే నేతలకు ఈ నామినేటెడ్ పోస్టులో అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం. ఆయా నియోజకవర్గాల పరిధిలోని మార్కెట్ కమిటీ చైర్మన్‌లుగా పాలకవర్గం సభ్యులుగా, ఎమ్మెల్యేలు లేదా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ఇన్‌చార్జి మంత్రి సూచించిన వారికి ఈ పదవులు కట్టబెట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ నెలలో నే కొంత మందికి అవకాశాలు నామి నేటెడ్ పోస్టులో ఇవ్వనున్నట్లు పార్టీ సీనియర్ నేతల సమాచారం. పదవులు భర్తీ చేస్తారని సమాచారం ఉండటంతో నేతలంతా హైదరాబాద్‌లోనే ఉండి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. దీర్ఘకాలికంగా పనిచేసిన నేతలతో పాటు ఎన్నికల సమయంలో చేరిన వారికి కూడా ఈ అవకాశం కల్పించనున్నట్లు సమాచారం.



• గుర్రపుడెక్కలతో నిండిపోయిన పూలాంగ్ కెనాల్

పూలాంగ్‌లో పూడికతీతలు ఎప్పుడు?

- పిచ్చిమొక్కలతో నిండిపోయిన పూలాంగ్ కెనాల్
- పూడికతీతపై పట్టించుకోని అధికారులు

సుభాష్‌నగర్, జూలై 16: వర్షాకాలం మొదలవుతుండగా హడావిడి చేసిన అధికారులు కెనాల్‌లో పేరుకుపోయిన చెత్తను తీసివేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. కెనాల్‌లో ఉన్న పూడిక తీసేందుకు ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పిన అధికారులు పనులు చేయడంలో మాత్రం జాప్యం చేస్తున్నారు. నగర శివారులోని నాగారం నుంచి ప్రారంభమైన పూలాంగ్ వాగు మానిక్ భండార్ వరకు కిలోమీటరు మేర విస్తరించి ఉంది. ఈ కెనాల్‌లో టన్నుల కొద్ది చెత్తా, చెదారం, పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. భారీ వర్షాలు కురిస్తే ఈ కెనాల్ గుండా నీళ్లు సాఫీగా వెళ్లడం కష్టసాధ్యమే. దాంతో సమీపంలోని ఇండ్లలోకి నీరు చేరి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రతీ సంవత్సరం వేసవి కాలంలో మున్సిపల్ సిబ్బంది డ్రైన్‌లు, డీ-57 వంటి పెద్ద మురికి కాలువలు ప్రత్యేక యంత్రాలతో శుద్ధి చేయాల్సి ఉంది. అయినా అధికారులు కాలువల చెత్త పూడికతీతపై శ్రద్ధ పెట్టడం లేదు. కాలువ మొత్తం గుర్రపుడెక్కలతో నిండిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూడికతీత పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రుణాల పేరిట మోసగించిన బ్యాంకు మేనేజర్

- 40మంది ఖాతాల నుంచి రూ.5 కోట్లకు పైగా నగదు స్వాహా
- ఆలస్యంగా వెలుగులోకి..
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు
- పరారీలో మేనేజర్



ఖిల్లా, జూలై 16: బ్యాంకు ఖాతాదారులకు ఇవ్వాల్సిన రుణాలు ఇవ్వకుండా.. తానే తీసుకొని ఘరానా మోసానికి పాల్పడ్డాడో బ్యాంకు మేనేజర్. రుణాల పేరిట సుమారు 40మంది ఖాతాల్లో నుంచి రూ.5కోట్లకు పైగా డబ్బును తమ ఖాతాలో జమ చేసుకుని మోసగించాడు. ఆ బ్యాంకు మేనేజర్‌ను బ్యాంకు ఉన్నతాధికారులు సస్పెన్షన్ చేయడం.. పోలీసులకు బాధితుల ఫిర్యాదుతో మంగళవారం రాత్రి ఈ ఘటన వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. నగరంలోని శివాజీనగర్‌లో గల యూనియన్ బ్యాంకు మేనేజర్‌గా అజయ్ విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇతను ఖాతాదారులకు ఎనిమిది నెలల క్రితం టర్మ్ లోన్‌తో పాటు సీసీ (క్రెడిట్ ఆన్ కరెంటు అకౌంట్) లోన్‌లను మంజూరు చేశాడు. మొదటి విడతగా 40మంది ఖాతాదారులకు టర్మ్ లోన్‌ను చెల్లించాడు. మరో సీసీ లోన్ కోసం ఖాతాదారుల నుంచి అవసరమైన బ్యాంకు చెక్కులను, ఆస్తులకు చెందిన పత్రాలను తీసుకున్నాడు. మొదటి లోన్ మంజూరు చేయగా.. ఖాతాదారులు సీసీ లోన్ కోసం మేనేజర్ అజయ్ వద్దకు వెళ్లాడు. అయితే రెండో లోన్ మంజూరు కాలేదని వారిని నమ్మించి.. వారికి సంబంధించిన డబ్బు రూ.5 కోట్లను తన ఖాతాలోకి బదిలీ చేసుకున్నాడు. ఈ లావాదేవీలన్నీ గత జనవరి, ఫిబ్రవరి నెలల్లో జరగాయి. అయితే ఇటీవల బ్యాంకు ఉన్నతాధికారులు తనిఖీలకు వచ్చి కొందరి ఖాతాల్లోని లావాదేవీలను పరిశీలించగా.. రుణాల మంజూరులో తేడా జరుగుతున్నట్లు గుర్తించారు. దీంతో ఉన్నతాధికారులు బ్యాంకు లావాదేవీల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ గుర్తించి.. మేనేజర్ అజయ్‌ని సస్పెండ్ చేశారు. ఆ తర్వాత బ్యాంకు డబ్బులను రాబట్టుకోవడానికి ఉన్నతాధికారులు ఖాతాదారులను పిలిచి విచారించగా.. రుణాల స్వాహా వ్యవహారం బయటకు పొక్కింది. దీంతో ఖాతాదారులు లబోదిబోమంటూ మంగళవారం రాత్రి నగర సీఐ నరహరిని కలిశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి.. అజయ్‌పై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం మేనేజర్ అజయ్ పరారీలో ఉన్నాడు.


దర్యాపూర్ తండాలో పూజలు నిర్వహిస్తున్న గిరిజనులు

తండాల్లో ఘనంగా శీతల్ పండుగ

నవీపేట, జూలై 16: మండల కేంద్రంలోని దర్యాపూర్ తండాలో మంగళవారం గిరిజనులు శీతల్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భవానీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు బాగా కురియాలని, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని అమ్మవారికి ప్రసాదాన్ని సమర్పించారు. అనంతరం గిరిజన మహిళలు ఆటపాటలతో నృత్యం చేశారు.

● బట్టాపూర్‌లో..

ఏర్గట్ల: మండలంలోని బట్టాపూర్ గ్రామంలో మంగళవారం గిరిజనులు శీతల పండుగలను ఘనంగా జరుపుకున్నారు. గిరిజనుల ఆరాధ్య దేవతలైన అమ్మవార్లకు ఊరేగించి నైవేద్యం సమర్పించారు. వర్షాలు బాగా కురుసి పంటలు పండాలని, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భూక్య తిరుపతి నాయక్, భీమా నాయక్, శివ, అంజి, శ్రీనివాస్, రమేష్, శ్రీధర్, నారాయణ, గిరిజనులు పాల్గొన్నారు.

● వివేక్‌నగర్‌తండా, నల్లగుట్టతండాలో..

జక్రాన్‌పల్లి: మండలంలోని వివేక్‌నగర్ తండా, నల్లగుట్టతండాల్లో మంగళవారం శీతల్ పండగను ఇరు గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ రెండు గ్రామాల్లో గిరిజన మహిళలు, యువతులు కొత్త బట్టాలు ధరించి నైవేద్యాలు ఎత్తుకొని ఊరేగింపుగా జగదాంబ ఆలయాలకు చేరుకున్నారు. అనంతరం నైవేద్యాలు వేసి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాకాల వర్షాలు కురువాలని, చెరువులు నిండాలని, పంటలు పండాలని ప్రత్యేకపూజలు చేసి వేడుకున్నారు. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి వనభోజనాలు వెళ్ళారు. కార్యక్రమంలో గిరిజననాయకులు జితేందర్‌నాయక్, సంతోష్‌నాయక్ గ్రామస్థులున్నారు.


బట్టాపూర్‌లో పూజలు నిర్వహిస్తున్న గిరిజనులు

ఆర్‌వోబీ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

డిచ్‌పల్లి, జూలై16: మండలంలోని బర్దిపూర్ శివారులోని మాధవనగర్ ఆర్‌వోబీ పనులను మంగళవారం సాయంత్రం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనుల ఆలస్యంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామీణ ప్రజలు, నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో 8నెలల జైలు శిక్ష

ఎడపల్లి, జూలై 16: మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలోని పలు దేవాలయాల్లో వరుస దొంగతనాలు చేసిన వక్తికి మంగళవారం బోధన్ కోర్టు అదనపు న్యాయాధికారి సాయిశివ 8నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. అదనపు ప్రాసిక్యూటర్ చిదరాల రాణి తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని బిలోలి తాలూకా కొండల్‌వాడీ గ్రామానికి చెందిన జిత్తేవార్ గణేష్ అలియాస్ నర్సింలు ఎడపల్లి మండలంలోని మంగల్‌పాడ్ గారమంలోని బాలత్రిపురసుందరీ అమ్మవారి ఆలయం, గ్రామ శివారులోని చెరువు కట్టపై ఉన్న గంగమ్మతల్లి ఆలయాల్లో చోరీకి పాల్పడ్డాడినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన కుంట శ్రీనివాస్ ఏప్రిల్ 14న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు. చోరీకి పాల్పడ్డ వ్యక్తి ఎడపల్లి బస్టాండు వద్ద అనుమానాస్పందంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని నిందితుడిని కోర్టులో హాజరుపరుచగా నేరాలకు సంబంధిచిన సాక్ష్యాధారాలను పరిశీలించిన తర్వాత నేరం రుజువు కావడంతో న్యాయాధికారి 8నెలల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

'అమ్మమాట.. అంగన్‌వాడీ బాట' అవగాహన ర్యాలీ

కమ్మర్‌పల్లి, జూలై16: కమ్మర్‌పల్లి సెక్టార్ పరిధిలోని ఉప్లూర్ గ్రామంలో మంగళవారం స్థానిక అంగన్‌వాడీ సెంటర్ల నిర్వాహకులు అమ్మమాట అంగన్‌వాడీ బాట అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సెంటర్లలో చేరిన పిల్లలకు ఆటపాటలతో విద్యాబోధన, ప్రతీరోజు పౌష్టికాహారం, అంగన్‌వాడీ సెంటర్ల పరిధిలోని తల్లుకు ప్రతీరోజు పౌష్టికాహారం సదుపాయాలును వివరిస్తూ అవగాహనర్యాలీ నిర్వహించారు. తమ పిల్లలను సమీప అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. ర్యాలీలో ఐకేపీ సీఏలు, వైద్యఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, సరిత, లక్ష్మీశారద ఉన్నారు.

'పోరాటాల ఫలితమే వేతనాల విడుదల'

డిచ్‌పల్లి, జూలై 16: పోరాటాల ఫలితంగానే పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలు విడుదల సాధ్యమైందని, జూలై 5న రాష్ట్రవ్యాప్తంగా ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేయడంతో ప్రభుత్వం దిగి వచ్చిందని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు మురళి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12వరకు హామీ ఇచ్చారని, ఈ కారణంగానే ధర్నా విరమించానట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు రాజేందర్, నర్సయ్య, సుమన్, బుచ్చయ్య, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ వన్‌టైం బ్యాక్‌లగ్ పరీక్షల్లో పది మంది విద్యార్థుల గైర్హాజరు

డిచ్‌పల్లి, జూలై16: టీయూ పరిధిలోని డిగ్రీబ్యాక్‌లగ్ వన్‌టైం పరీక్షలు మంగళవారం 15వరోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. అనుబంధ కళాశాల పరిధిలో ఉదయం జరిగిన పరీక్షకు 19మంది విద్యార్థులకు 17మంది హాజరయ్యారని, ఇద్దరు గైర్హాజరయ్యారని చంద్రశేఖర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 107మంది విద్యార్థులకు 99 పరీక్షకు హాజరయ్యారని, 8 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

'కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలి'


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న వీఆర్‌ఏలు

డిచ్‌పల్లి, జూలై16: 11 నెలలు గడిచినా వీఆర్‌ఏ వారసులకు రాష్ట్ర ప్రభుత్వం జీవో ఉత్తర్వులు జారీచేయలేదని, వెంటనే 81జీవోను ప్రభుత్వం అమలు చేయాలని ఖాళీగా ఉన్న కారుణ్య నియామకాలను చేపట్టాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కి వీఆర్‌ఏల జేఏసీ ప్రతినిధులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. 61 పైబడిన వీఆర్‌ఏ వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టేందుకు నూతన జీవో ద్వారా అవకాశం కలిగిందని, కానీ ఇంతవరకు నియామక ఉత్తర్వులు జారీ చేయలేదని అన్నారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వీఆర్‌ఏ ప్రతినిధులకు రూరల్ ఎమ్మెల్యే హామీ ఇచ్చారని పేర్కొన్నారు.


మున్సిపల్ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

రాజకీయాలకు అతీతంగా ఆర్మూర్ అభివృద్ధి

● ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, జూలై16: ఆర్మూర్ నియోజకవర్గాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయం ముఖద్వారాన్ని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ విలీన గ్రామాల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి నిధులు మంజూరు చేయాలని కోరుతానన్నారు. పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల మంత్రులు కలిసి ఆర్మూర్ అభివృద్ధికి నిధులు మంజూరుకు నివేదిస్తామన్నారు. పట్టణంలో అక్రమణలు, కబ్జాలు పాల్పడితే సహించేదిలేదని, రౌడీయిజం ఉండకూడదని ఎమ్మెల్యే హెచ్చరించారు. కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అభివృద్ధిలో ముందుకు సాగుతామన్నారు. అభివృద్ధిలో అంగడిబజార్‌లోని మార్కెట్‌ను పరిశీలించారు. రైతులు తమ కూరగాయల వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించేందుకు షెడ్డును నిర్మించాలని సూచించారు. పిప్రి రోడ్డులో వన మహోత్స కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మొక్కలు నాటారు. ప్రతీఒక్కరు మొక్కలు నాటివాటిని సంరక్షించాలన్నారు. చెట్లు నరికితే భవిష్యత్ తరాలకు హానీ జరుగుతుందని, పండ్లు, నీడనిచ్చే మొక్కలనే నాటి కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య శ్రీనివాస్, వైస్‌చైర్మన్ షేక్‌మున్న, మున్సిపల్ కమిషనర్ రాజు, కౌన్సిలర్లు గంగామోహన్‌చక్రు, ఆకుల రాజు, ఇట్టెడి నర్సారెడ్డి, సుంకరి రంగన్న, సర్వసమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు
అన్ని రంగాల్లో రాణించాలి

● మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి


విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

బోధన్ రూరల్, జూలై 16: ప్రభుత్వపాఠశాల విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని, కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్‌రెడ్డి అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట ప్రభుత్వ పాఠశాలతో పాటు సాలూర మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కేవీ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితనోట్ పుస్తకాలతో పాటు విద్యార్థులకు కావాల్సిన వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అన్ని వసతులు, సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రభు రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మా భూమిని మాకు ఇప్పించండి

● తహసీల్దార్‌కు వృద్ధ దంపతుల వినతి

నవీపేట, జూలై 16: కబ్జాకు గురైన తమ భూమిని తమకు ఇప్పించాలని మండలంలోని గాంధీనగర్‌కు చెందిన గజ్జ కమలమ్మ, ఎల్లయ్య వృద్ధ దంపతులు మంగళవారం తహసీల్దార్ నారాయణకు వినతిపత్రం సమర్పించారు. లింగాపూర్ పరిధిలోని శాఖాపూర్ శివారులో సర్వేనెంబర్ 289లో 37గుంటలు, సర్వేనెంబర్ 291/1లో ఎకరం 3గుంటలు ఉండగా.. 37 గుంటల భూమిని సిరన్‌పల్లిలోని ఒడ్డెరకాలనీకి చెందిన లక్ష్మణ్ అక్రమించాడని పేర్కొన్నారు. దీనిపై పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని, భూమే జీవనాధారమైన తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

ఒకరిపై అట్రాసిటీ కేసు నమోదు

బోధన్ రూరల్, జూలై1 6: మండలంలోని పెగడాపల్లి గ్రామంలో ఒకరిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. నాగన్‌పల్లి గ్రామానికి చెందిన కొండపల్లి నరేష్ గోసంగి ఫిర్యాదు మేరకు గ్రామంలోని ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు పూర్తి విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. పెగడాపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కౌలుకు పొలం చేస్తున్న కొండపల్లి నరేష్‌ను బూతుమాటలు తిట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు.

వ్యక్తి అదృశ్యం

బోధన్‌రూరల్, జూలై16: మండలంలోని ఊట్‌పల్లి గ్రామానికి చెందిన షేక్ ఖాజా ఈనెల 13న బోధన్‌కు వెళ్లి వస్తానని అదృశ్యమైనట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. అదృశ్యమైన వ్యక్తి భార్య నస్రీన్ బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని చెప్పారు. సీసీ ఫుటేజీల ద్వారా అన్నికోణాల్లో విచారణ చేపడుతున్నామని త్వరలో ఆచూకీ తెలుసుకుంటామని ఆయన తెలిపారు.

ఉపాధ్యాయేతర పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వేల్పూర్, జూలై 16: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామశివారులోని జాన్కంపేట్ గ్రామం వద్ద ఉన్న కసూర్బా విద్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధ్యాయేతర సిబ్బంది విధులు నిర్వహించడానికి దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాధికారి వనజారెడ్డి, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి వినోద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెడ్‌కుక్ విధులు చేయడానికి పదో తరగతి, అసిస్టెంట్ కుక్, స్వీపర్ విధులు చేయడానికి 7వ తరగతి పాసై ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన వారికి రూ.9750 నెలసరి వేతనం ఉంటుందని తెలిపారు. పోస్టులకు అర్హత ఉండి ఆసక్తి గల మహిళలు జూలై 20 లోపు మండల విద్యాధికారి కేంద్రం (ఎంఆర్‌సీ) వేల్పూర్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

'ముదిరాజ్‌లను బీసీఏలో చేర్చాలి'

ఎడపల్లి, జూలై 16: రాష్ట్రంలో ఉన్న ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని మంగళవారం మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఎడపల్లి తహసీల్దార్ ధన్వాల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సున్నపు ఒడ్డెన్న మాట్లాడుతూ రాష్ట్రంలో 2014 ఆగస్టు 18, 19 తేదీల్లో చేసిన కుటుంబ సర్వేఆధారంగా వెనుకబడిన తరగతులలో 10శాతం, రాష్ట్రపూర్తి జనాభాలో 13శాతం ఉన్న తమలో కొందరు మత్స్య, తోటల పెంపకం, ఇతర వృత్తులలో జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో అభయహస్తంలో పేర్కొన్న మాదిరిగా జీవో 15 ప్రకారం ముదిరాజ్‌లను బీసీ ఏకు మార్చాలని కోరారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ధర్నా చేపట్టి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఆయనవెంట ముదిరాజ్ సం ఘం జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణ, నాయకులు రాజ్ కుమార్, మనోజ్, అశోక్, నెల్లిరాజు, ఆంజనేయులు, గుండారం సాయిలు, జనార్ధన్ ఉన్నారు.


తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

కేశవ స్మృతి మందిరానికి
జాతీయస్థాయిలో గుర్తింపు తెస్తాం

● కందకుర్తి క్షేత్రం అభివృద్ధికి కృషి చేస్తా : ఎంపీ ధర్మపురి అరవింద్


కందకుర్తిలో కేశవ స్మృతి వనాన్ని పరిశీలిస్తున్న ఎంపీ అరవింద్

రెంజల్, జూలై 16: కందకుర్తి త్రివేణి సంగమం క్షేత్రంలోని కేశవ స్మృతి వనానికి జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చి కందకుర్తి త్రివేణి సంగమ అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ ధర్మపురి అరవింద్ పేర్కొన్నారు. మంగళవారం కందకుర్తి గ్రామంలో నిర్మిస్తున్న కేశవ స్మృతివనంతో పాటు స్కంద మందిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర పుణ్యక్షేత్రమైన కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రంలో కేశవ స్మృతి వనాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని, కేశవ స్మృతి వనాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దుతామని ఆయన అన్నారు. హెగ్డెవార్ పూర్వీకుల గ్రామమైన కందకుర్తి పుణ్యక్షేత్రంలో కేశవ స్మృతి వనం, స్కంద మందిరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి తీరుతామని అన్నారు. ఆయనవెంట బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు గోపికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు మేక సంతోష్, అసెంబ్లీ కన్వీనర్ కూరెళ్ల శ్రీధర్, మాజీ వైస్ ఎంపీపీ యోగేష్, మాజీ ఉపసర్పంచ్ యోగేష్, గోవింద్ ఉన్నారు.

గ్రామాల్లో అమ్మమాట.. అంగన్‌వాడీ బాట

వేల్పూర్, జూలై16: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని మంగళవారం వేల్పూర్ మండలం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ప్రారంభించారు. మొదటిరోజు ఆయా గ్రామాలోల అంగన్‌వాడీ టీచర్‌ల ఆధ్వర్యంలో గ్రామాల వీధులగుండా పిల్లలు, తల్లులతో ర్యాలీ నిర్వహించారు. మండలంలోని అంక్సాపూర్ గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగహంస మాట్లాడారు. మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి వారికి విద్య నేర్పించేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆట వస్తువులు, పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. పిల్లలకు పసిప్రాయం నుంచే అక్షరాభాస్యం చేయించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కార్యక్రమాన్ని రాష్ట్రప్రభుత్వం చేపట్టిందన్నారు. 15నుంచి 20వ తేదీ వరకు అమ్మమాట అంగన్‌వాడిబాట కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు.


మోర్తాడ్‌లో పిల్లలతో తల్లిదండ్రులు

మోర్తాడ్: మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అమ్మమాట అంగన్‌వాడీపాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పిల్లలు, తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్లు కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ ముద్దు.. ప్రైవేటు వద్దు అంటూ తల్లిదండ్రులు నినాదాలు చేశారు. కా ర్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, సుమన, సులోచన, శారద, గంగజమున, అంజమ్మ ఉన్నారు.


జాన్కంపేట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


తైక్వాండో పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులు

తైక్వాండో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

ఆర్మూర్‌టౌన్, జూలై 16: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర తైక్వాండో చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా తైక్వాండో చాంపియన్‌షిప్ నిర్వహించగా పట్టణానికి చెందిన రాయల్ తైక్వాండో అకాడమిలోని 11 మంది క్రీడాకారులు సబ్/జూనియర్, కెడిట్ జూనియర్లు పాల్గొనగా ముగ్గురు స్వర్ణ, నాలుగు రజత, నాలుగు క్యాంస పథకాలు సాధించారని తైక్వాండో అధ్యక్షుడు ప్రవీణ్ తెలిపారు.

ప్రతీ ఇంట్లో మొక్కలు నాటాలి

మోర్తాడ్, జూలై16: మండలంలోని దొన్కల్ గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌లు మంగళవారం మహిళలకు మొక్కలు పంపిణీ చేశారు. గ్రామంలో ప్రతీ ఇంటికి ఐదు మొక్కలు నాటాలని మహిళలను కోరారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి టీచర్‌లు మహిళలకు వివిధ రకాల మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.


దొన్కల్‌లో మహిళలకు మొక్కలను పంపిణీ చేస్తున్న దృశ్యం

రైలు కిందపడి యువజంట ఆత్మహత్య

● బంధువుల దుష్ప్రచారమే కారణమంటూ ఆవేదన
● సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన యువతి
● హెగ్డోలిలో విషాదం


అనిల్, శైలజ (ఫైల్‌ఫొటో)

కోటగిరి/నవీపేట్, జూలై 16: కుటుంబ కలహాలు ఓ యువజంట బలవన్మరణానికి కారణమైంది. తనపై బంధువులు చేస్తున్న దుష్ప్రచారాన్ని తట్టుకోలేక మనస్థానికి గురైన యువతి భర్తతో కలిసి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన నవీపేట మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. పొతంగల్ మండలంలోని హెగ్డోలి గ్రామానికి చెందిన అనిల్ (26), శైలజ (20)లకు రెండేళ్ల క్రితం వివాహమైంది. సాఫీగా సాగుతున్న వీరి జీవితంలో గతంలో యువతి చేసిన చిన్నతప్పు ప్రాణాల మీదికొచ్చింది. తాను ఎలాంటి తప్పూ చేయనని అత్తమామలు, భర్తలకు సర్దిచెప్పుకుంది. అయినా తన పిన్ని తనపై బంధువుల వద్ద దుష్ప్రచారం చేయడంతో తీవ్ర మనస్థాపానికి గురైంది. సోమవారం ఉదయం ఇంటర్వ్యూ పేరుతో భార్యభర్తలు ఇద్దరూ బాసర గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సోషల్‌మీడియాలో శైలజ పోస్ట్‌చేసింది. మృతురాలి బావ పోస్ట్‌ను సోమవారం రాత్రి కోటగిరి ఎస్సై సందీప్‌కు పంపించారు. అప్రమత్తమైన ఎస్సై నవీపేట ఎస్ఐకి సమాచారం అందించారు. పోలీసులు బాసర గోదావరి బ్రిడ్జి వద్ద వీరు కోసం గాలించి మొబైల్ నెంబర్‌ను ట్రేస్‌చేశారు. అప్పటికే ఫకీరాబాద్, మిట్టాపూర్ మధ్యలో రైల్వేట్రాక్‌పై ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వేపోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను జిల్లా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్, ఆయిల్ చోరీ

కోటగిరి, జూలై 16: పొతంగల్ మండలంలోని కొల్లూర్ గ్రామ శివారులో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లలో ఆయిల్, కాపర్ వైర్లను చోరీ చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. పొతంగల్ ట్రాన్స్‌కో ఏఈ నర్సారెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్సై ఘటనస్థలాన్ని పరిశీలించారు. 40 కేవీ, 60 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లను పగులగొట్టి రాగివైరు, ఆయిల్ తొగించినట్లు గుర్తించారు. ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ వెల్లడించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

● రూ.19వేల 390, ఆరు ఫోన్‌లు స్వాధీనం

ఆర్మూర్‌టౌన్, జూలై 16: ఆలూర్ మండలకేంద్రంలో ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేసి ఏడుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేశారు. పేకాట ఆడుతున్నట్లు వచ్చిన పక్కా సమాచారం మేరకు దాడి చేసి వారివద్ద నుంచి రూ.19వేల 390లతోపాటు ఆరు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడిలో ఎస్సై అంజమ్మతో పాటు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది లక్ష్మన్, రాములు అనిల్‌కుమార్, నర్సన్న పాల్గొన్నారు.


ఆలూర్‌లో పోలీసులు పేకాట రాయుళ్ల అరెస్టు


నాళేశ్వర్‌లో క్రాప్‌బుకింగ్ నిర్వహిస్తున్న అధికారులు

పంటల సాగు వివరాల నమోదును వేగంగా చేపట్టాలి

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్

నవీపేట, జూలై 16: జిల్లాలో వానకాలానికి సంబంధించిన పంటల నమోదు వివరాల ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్ కోరారు. మంగళవారం మండలంలోని నాళేశ్వర్‌లో రైతులు సాగుచేస్తున్న పంటలను పరిశీలించారు. ఏఈవోలు క్రాప్ బుకింగ్ యాప్ ద్వారా రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏవో సురేష్ గౌడ్, ఏఈవో వసంత్, పలువురు రైతులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

● సీఎంకు ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఫిర్యాదు

ఆర్మూర్ టౌన్, జూలై 16: ఆర్మూర్ మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి రాత పూర్వకంగా ఫిర్యాదుచేశారు. మున్సిపాలిటీలో అసైన్డ్‌మెంట్ భూములతో పాటు నిబంధనలకు విరుద్ధంగా భూములు, సుమారు 300 ఇంటి నెంబర్లు కేటాయించారని పేర్కొన్నారు. అలాగే పెర్కిట్, పట్టణంలోని ధోబిగల్లీ, జిరాయత్‌నగర్ వెంచర్లలో అవకతవకలు జరిగాయని, అలాగే మున్సిపాలిటీలో మిషన్ భగీరథ వాటర్ పైపులైన్‌తో పాటు గ్రావెల్ వర్క్‌లో తప్పుడు బిల్లులు చేస్తున్నారని, 16 మోటార్ వెహికిల్స్‌లో అవినీతి జరిగిందని తెలిపారు. టీయూఎఫ్‌ఐడీసీ నిధులైన రూ.75లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించి డ్రైనేజీ నిర్మాణం సరిగ్గా చేపట్టనందున నిధులు నష్టపోయామని, దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆవులకు మత్తుమందు!

● అర్ధరాత్రి ఇంజక్షన్లు ఇచ్చి దూడను ఎత్తుకెళ్లిన దుండగులు

ఎడపల్లి, జూలై16: మండల కేంద్రంలోని హనుమాన్ (గ్రామం) ఆవులకు సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మత్తు ఇంజక్షన్లు ఇచ్చారు. రాత్రి వర్షం పడడంతో గ్రామ ఆవులు మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిద్రించాయి. ఆ సమయంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఇన్నోవా కారులో వచ్చి నిద్రిస్తున్న ఆవులకు మత్తు ఇంజక్షన్ ఇచ్చారని గ్రామస్థులు తెలిపారు. ఆవులు మత్తులోకి వెళ్లే వరకు గ్రామంలో తిరుగు తున్న వీరిని గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు గమనించి వెంబడించగా అప్పటికే ఇన్నోవా వాహనం డిక్కీలో దూడను వేసుకుని ఎత్తుకెళ్లినట్లు యువకులు తెలిపారు. వెటర్నరీ డాక్టర్ సందీప్‌కు సమాచారం ఇవ్వగా ఆయన వెంటనే ఆవులకు చికిత్స చేశారు. మంగళవారం ఉదయం గ్రామ యువకులు పోలీస్‌స్టేషన్‌లో ఆవులను ఎత్తుకెళ్లేందుకు వచ్చిన దండగులను పట్టుకుని శిక్షించాలని ఫిర్యాదు చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాళ్లున్న బియ్యాన్ని మార్చేయండి: డీఈవో

నవీపేట, జూలై16: మధ్యాహ్నభోజనానికి సరఫరా అయిన బియ్యంలో రాళ్లు, మెరిగెలతోపాటు ఎలుకల వ్యర్థాలు వస్తున్నాయనే విషయంపై డీఈవో దుర్గాప్రసాద్ స్పందించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'మధ్యాహ్న భోజన బియ్యంలో రాళ్లు' అనే కథనానికి డీఈవో స్పందించి చర్యలు చేపట్టారు. మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు ఇటీవల సరఫరా అయిన బియ్యంలో రాళ్లు, మెరిగెలు, ఎలుకల వ్యర్థాలు ఉండడంతో అసహనం వ్యక్తం చేస్తూ బియ్యాన్ని మార్చేయాలని, మంచి బియ్యాన్ని పాఠశాలలకు పంపాలని ఎంఈవోను ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కడైనా బియ్యంలో రాళ్లు, వ్యర్థాలు ఉంటే వెంటనే తహసీల్దార్‌లు, సివిల్‌సప్లై అధికారుల సహకారంతో బియ్యాన్ని మార్చుకోవాలని తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

వర్ని, జూలై 16: మండలంలోని డిపోతండా వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై కృష్ణ కుమార్ తెలిపారు. పిట్లం మండలానికి చెందిన దత్తురెడ్డి, బాన్సువాడకు చెందిన మధుసూదన్ రెడ్డిలు వర్నివైపు ఆల్టో కారు టీఎస్08జీడీ8264 వెళ్తుండగా ఎదురుగా వెళ్తున్న ఐఎస్ యూజడ్‌యూ ఏపీ 39 యూడీ 3168 నంబరు గల వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఐఎస్ యూజడ్‌యూ వాహనడ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

చేపపిల్లలకు బదులు నగదు ఇవ్వాలని వినతి

కోటగిరి, జూలై16: ప్రభుత్వం మత్స్యకారులకు ఇస్తున్న నాణ్యత లేని చేపపిల్లలకు బదులుగా నగదు అందజేయాలని పొతంగల్ మండల మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు మాగిరి శ్రీనివాస్ కోరారు. పొతంగల్ తహసీల్దార్ మల్లయ్యకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. నాణ్యత లేని చేపపిల్లలతో మత్స్యకారులందరూ నష్టపోతున్నారని అన్నారు. చేపపిల్లలకు బదులు నగదు అందజేస్తే నాణ్యమైన చేపపిల్లలను వేసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం సభ్యులు మక్కయ్య, గంగారాం, పోశెట్టి, సాయిలు పాల్గొన్నారు.


పొతంగల్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

ఆరోగ్య కేంద్రం ప్రారంభమెప్పుడో?

● అలంకార ప్రాయంగా ఆరోగ్య ఉప కేంద్రాలు ● ప్రారంభానికి ముందే పగుళ్లు.. ● వైద్యం అందుబాటులో లేక ప్రైవేటుకు పరుగులు

ముప్కాల్, జూలై 16: గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం నిర్మించిన పల్లె దవాఖానాలకు సుస్తి చేసింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ముప్కాల్ మండల కేంద్రంలో రూ.16 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి 2022 మార్చి 20న మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రారంభించిన నాటినుంచి నత్తకే నడక నేర్పిన విధంగా సాగిన పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. భవననిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే సంకల్పంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు అలంకారప్రాయంగా మిగిలిపోతున్నాయి. దీంతో అందుబాటులో వైద్యం లేక ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులవైపు పరుగులు తీస్తున్నారు. అప్పులు చేసి మరీ వైద్యం చేసుకున్నా ప్రాణాలు నిలవక అప్పుల పాలవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పల్లె దవాఖానాలను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.


దవాఖానలో ఏర్పడిన లీకేజీ

● ప్రారంభానికి ముందే లీకేజీ

లక్షలు వెచ్చించి నిర్మించిన దవాఖానా భవనం ప్రారంభానికి ముందే పగుళ్లు ఏర్పడి నీటి లీకేజీలు ఏర్పడ్డాయి. నాసిరకం పని వల్లే గోడలకు పగుళ్లు ఏర్పడి కొద్దిపాటి వర్షానికే నీరు లీకేజీ అవుతోంది. సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


భవనానికి ఏర్పడ్డ పగుళ్లు


ప్రారంభానికి సిద్దంగా ఉన్న దవాఖాన

త్వరలో వైద్యసేవలు ప్రారంభిస్తాం

● రాకేష్, వైద్యుడు

ముప్కాల్‌లో నిర్మించిన పల్లె దవాఖానా సాధ్యమైనంత త్వరగా ప్రారంభిస్తాం. కొద్దిపాటి విద్యుత్ నేటి పనులు పూర్తి కావాల్సిన ఉంది. త్వరగా పూర్తి చేసే ప్రారంభిస్తాం.


పతకాలతో జిల్లా క్రీడాకారులు

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

సుభాష్‌నగర్, జూలై 16: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలో జిల్లా క్రీడాకారులు ప్రతిభను చాటారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఏడవ తెలంగాణ రాష్ట్రస్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలలో పలువురు క్రీడాకారులు బంగారు, రజత, కాంస్య పతకాలను సాధించారు. జిల్లా నుంచి 38 మంది క్రీడాకారులు పాల్గొనగా జూనియర్, సీనియర్ విభాగాల్లో పాల్గొని పది బంగారు పతకాలు, ఐదు రజక పతకాలు, ఎనిమిది కాంస్య పతకాలు మొత్తం 23 పతకాలను సాధించారని జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వినోద్‌నాయక్, కోశాధికారి వినోద్ తెలిపారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఆగస్టులో ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు. ఈ పోటీలో ప్రతిభకనబర్చి జిల్లాకు పతకాలు సాధించడం పట్ల క్రీడా అభిమానులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

కోటగల్లి ప్రభుత్వ బాలికల పాఠశాల మధ్యాహ్న భోజన ఏజెన్సీని రద్దు చేయాలి

నిజామాబాద్ అర్బన్, జూలై 16: అఖిలభారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని కోటగల్లి ప్రభుత్వ బాలికల పాఠశాల మధ్యాహ్న భోజన ఏజెన్సీని రద్దు చేయాలని ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు అంజలి మాట్లాడుతూ కోటగల్లి బాలికల పాఠశాలలో విద్యార్థులకు సరైన భోజనం పెట్టకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పురుగుల అన్నం పెట్టడంతో విద్యార్థులు తమ ఇంటి నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకునే పరిస్థితి ఉందన్నారు. పురుగుల అన్నంతో పాటు నీళ్లచారు పెడుతున్నారని విద్యార్థులు ఫిర్యాదులు చేసినా స్పందించకపోవడం దారుణమని వెంటనే ఆ మధ్యాహ్న భోజన ఏజెన్సీని రద్దు చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టేలా చూడాలన్నారు.

పోరాటాల ఫలితంగానే బకాయిలు విడుదల

● ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్

ధర్పల్లి, జూలై 16: పోరాటాల ఫలితంగానే గ్రామ పంచాయతీ కార్మికుల బకాయి వేతనాల నిధులు విడుదల అయ్యాయని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన సఫాయి కార్మికులతో కలిసి మాట్లాడుతూ పోరాటం ఫలితంగానే గ్రామ పంచాయతీ బకాయి వేతనాలు చెల్లింపు కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. పోరాటంలో పాల్గొన్న ప్రతీ గ్రామ పంచాయతీ కార్మికులను ఆయన అభినందించారు. జూలై 11న ఛలో హైదరాబాద్ రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యాలయాన్ని రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన పంచాయతీ కార్మికులతో ముట్టడించామన్నారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న జీతాలను పోరాడి సాధించుకున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 150 కోట్ల బకాయిలను ప్రభుత్వం రిలీజ్ చేసిందన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ నాయకులు ధామోదర్, అశీష్, ఆశన్న, సాయిలు, సాయినాథ్, సులోచన, సాయవ్వ, శారద, విలాస్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతినెలా సకాలంలో వేతనాలు చెల్లించాలి

పెద్దబజార్, జూలై 16: సఫాయి కార్మికులు ప్రజారోగ్యం కోసం తపించి పనిచేస్తున్న విషయం రాష్ట్ర ప్రభుత్వం గమనించి ప్రతినెలా సకాలంలో వేతనాలు అందించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దాస్ అన్నారు. మంగళవారం నగరంలోని ద్వారకనగర్‌లోగల ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికులందరిని యుద్ధప్రాతిపదికన క్రమబద్ధీకరించాలని పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలను వర్తింపజేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంత్రులను, అధికారులను కలిసి వినతిపత్రం అందించడం జరిగిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె చేసిన నిర్లక్ష్యం చేసిందని అన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనత, గంగాధర్, సుధాకర్, పోశెట్టి, రాజు పాల్గొన్నారు.

ఎంపీవో బదిలీ

సిరికొండ, జూలై 16: సిరికొండ మండల పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీప్రసాద్‌ను నందిపేట్ మండల పంచాయతీ అధికారిగా బదిలి అయ్యారు. చందూర్ మండల పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న తారచంద్‌ను సిరికొండ ఎంపీవోగా బదిలీ చేసినట్లు సమాచారం.

గ్రామ సంఘాల్లో సీఎస్‌పీ నిర్వాహకురాల చేతివాటం

» సుమారు రూ.50లక్షల నిధులకు పైగా స్వాహా
» సీఆర్పీకి బ్యాంకు అధికారుల సహకారం.?
» ఆందోళనలో డ్వాక్రా మహిళలు


కల్లూర్ గ్రామ పంచాయతీ ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

కోటగిరి, జూలై 16: కూలీ, నాలీ పని చేసుకుంటూ సంపాదించిన మొత్తాన్ని మహిళలు తాము చేసుకున్న డ్వాక్రా గ్రూపుల్లో చెల్లించే మహిళల పట్ల సీఎస్‌పీ నిర్వాహకురాలు తన చేతివాటం ప్రదర్శించింది. సుమారు 50లక్షల రూపాయలకు పైగా స్వాహ చేయడం విశేషం. సీఎస్‌పీ నిర్వాహకురాలు బ్యాంకు అధికారుల అండతోనే నిధుల స్వాహాకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో మహిళలు పంచాయతీ కార్యాలయం, బ్యాంకు ఎదుట ఆందోళనకు దిగిన సంఘటన పొతంగల్ మండలంలోని కల్లూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పొతంగల్ మండలంలోని కల్లూర్ గ్రామంలో సీఎస్‌పీ(కస్టమర్ సర్వీస్ పాయింట్) కేంద్రం నిర్వహిస్తున్న సంధ్య డ్వాక్రా మహిళల నిధులను స్వాహా చేసింది. వివరాల్లోకి వెళితే కల్లూర్ గ్రామంలో రెండు గ్రామ సంఘాలు ఉండగా 38 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. గ్రామంలో కెనరా బ్యాంకు ద్వారా మహిళలు రుణాలు పొందుతున్నారు. తాము తీసుకున్న రుణాలను గతంలో బ్యాంకులో సక్రమంగా చెల్లిస్తూ వచ్చారు. ఏడాది క్రితం గ్రామంలో బ్యాంకు అధికారులు డ్వాక్రా మహళల కోసం ప్రత్యేకంగా ఫినోకార్ప్ అనే ప్రైవేటు సీఎస్‌పీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సీఎస్‌పీ నిర్వాహకురాలిగా సంధ్య వ్యవహరిస్తూ వచ్చింది. గ్రామంలో నాలుగు నెలల పాటు ఫినో బ్యాంకు ద్వారా డ్వాక్రా మహిళల రుణాల చెల్లింపు సక్రమంగా జరిగింది. తదనంతరం సీఎస్‌పీ నిర్వాహకురాలు బ్యాంకులో డబ్బులు జమ చేయడంలో చేతి వాటం ప్రదర్శిస్తూ వచ్చింది. డ్వాక్రా మహిళలు ప్రతి నెల సీఎస్‌పీ కేంద్రంలో సంధ్యకు రుణాలు చెల్లిస్తూ వచ్చారు. ఈ మొత్తాన్ని బ్యాంకులో జమ చేయడంలో సంధ్య నిర్లక్ష్యంగా వ్యవహరించింది. కొందరి డబ్బులు వారి వారి ఖాతాల్లో జమ చేస్తూ మిగిలిన డబ్బులను తన సొంత ఖాతాలకు మళ్లించుకుంది. రుణాలు చెల్లించిన మహిళలు రసీదులు అడిగితే ప్రింటింగ్‌లు రావడం లేదని బుకాయించింది. ఆమె మాటలు నమ్మి మహిళలు మిన్నకుండిపోయారు. రుణాలు చెల్లిస్తూ వచ్చారు. కొందరు మహిళలు తాము తీసుకున్న రుణాలు పూర్తి చెల్లించి కొత్త రుణాల కోసం బ్యాంకుకు వెళితే అసలు విషయం బయట పడింది. గ్రామంలోని ఓ సంఘానికి 8 నెలల నుండి బకాయి ఉందని బ్యాంకు అధికారులు చెప్పడంతో డ్వాక్రా మహిళలు ఆందోళనకు గురయ్యారు.

బ్యాంకు అధికారి పాత్రపై అనుమానాలు..

కల్లూర్‌లోని డ్వాక్రా సంఘాల్లో నిధుల స్వాహా చేయడంలో బ్యాంకు అధికారుల పాత్ర ఉన్నట్లు స్పష్టమవుతోంది. మహిళలు తీసుకున్న రుణాలు 90రోజుల్లో చెల్లించకపోతే ఎంపీఏ కింద బ్యాంకు అధికారులు గుర్తించి ఐకేపీ అధికారులకు సమాచారం అందిస్తారు. ఎంపీఏతో పాటు ఓవర్ డివ్ ఉంటే తప్పనిసరి ఐకేపీ అధికారులు వివిధ సంఘాలతో చర్చించి నిధులను జమ చేయాల్సి ఉంటుంది. సీఎస్‌పీ నిర్వాహకురాలు డ్వాక్రా సభ్యుల రుణాల చెల్లింపులో ఎన్‌పీఏ, ఓవర్ డీవ్ వివరాలు రాకుండా జాగ్రత్త పడినట్లు తెలుస్తోంది. బ్యాంకు అధికారుల ప్రమేయం లేకపోతే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవు. మరో వైపు బ్యాంకు అధికారులు డ్వాక్రా మహిళల ఖాతాలకు సంవివరాల ప్రింటింగ్ ఇవ్వకపోవడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

గ్యారంటీల అమలులో భాగంగా రుణమాఫీ

● రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి


మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ రూరల్, జూలై, 16: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అప్పులకుప్పగా మార్చారని, అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో భాగంగా రైతు రుణమాఫీ చేస్తుందని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతు రుణమాఫీపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తూ జీవోనెంబర్ 567/2024ను జారీచేశారన్నారు. దీంతో 32వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. రైతులను రాజులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఇప్పటివరకు వైఎస్ హయాంలో ఒకసారి రైతురుణమాఫీ చేసిందని, తర్వాత రెండోసారి కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే రుణమాఫీ చేయడం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలకు పెంచడం, ఆసుపత్రులను సైతం పెంచామని భూపతిరెడ్డి తెలిపారు. గతంలో అప్పుల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లో నడిపిస్తున్నామన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో సన్న బియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందన్న దుర్బుద్ధితో బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు మతితప్పి మాట్లాడుతున్నారని భూపతిరెడ్డి మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా రాష్ట్రంలో ప్రజలు ఎన్నుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడటం హాస్యాస్పదం అన్నారు కేంద్రంలోని బీజేపీ ఒక్కొక్క ఎంపీలను తమ పార్టీలో చేర్చుకుంటూ రాష్ట్రంలో ఇతర పార్టీలనుంచి వచ్చిన వారిని కాంగ్రెస్‌లో చేర్చుకుంటే ఎందుకు విమర్శిస్తున్నారని నిలదీశారు. పసుపు బోర్డు తెచ్చామంటున్న ఎంపీ అరవింద్ బోర్డు ఎక్కడ పెట్టాడో చెప్పాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతలు గిడుగు గంగాధర్, ముప్ప గంగారెడ్డి, ఎల్లయ్య, అగ్గుభోజన్న, కొర్వ రాజేందర్, లింగం తదితరులున్నారు.



ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెద్దబజార్, జూలై 16: లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికుల పట్ల ప్రభుత్వం అధికారుల నిర్లక్ష్యాన్ని వీడనాడి పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ధర్నాచౌక్ వద్ద కార్మికులు ధర్నా నిర్వహించి అనంతరం ఇరిగేషన్ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరింగ్ అధికారులకు వినతిపత్రం ఇవ్వడంతో పాటు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలకు పైగా గుత్ప, అలీసాగర్ పరిధిలోని వివిధ పంప్‌హౌజ్‌ల వద్ద పనిచేసే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. పంప్‌హౌజ్‌లో విషసర్పాలు, తేళ్లు, క్రిమికీటకాలతో రోజు దినదిన గండంగా పనిచేస్తున్నారని అన్నారు. ఇటీవల పంప్‌హౌజ్ వద్ద తొమ్మిది పాములు రావడంతో వాటిని చప్పి కార్మికులు తమ ప్రాణాలు కాపాడుకున్నారని అన్నారు. కార్మికులకు నెలనెల వేతనాలు ఇవ్వకుండా సంవత్సరం నుంచి పీఎఫ్ డబ్బులను జమ చేయకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుంటే చోద్యం చూస్తున్నారని కార్మికులకు తమకు సంబంధం లేకుండా అధికారులు మాట్లాడటం సరైంది కాదని విమర్శించారు. తమ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు అనేక మార్లు వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గణేష్, మహిపాల్, కార్తిక్, సీతారాంనాయక్, బుచ్చన్న, అజయ్, తదితరులు పాల్గొన్నారు.


పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

'తెలుగు దివ్వెలు-గుండారం గువ్వలు' ఆవిష్కరణ

నిజామాబాద్ రూరల్, జూలై, 16: రూరల్ మండలం గుండారం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థుల రచనలతో కూడిన పుస్తకం "తెలుగు దివ్వెలు-గుండారం గువ్వలు" ఆవిష్కరణ మంగళవారం పాఠశాలలో ఆవిష్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అమర్‌నాథ్ మాట్లాడుతూ.. 2015 నుంచి 2024 వరకు గుండారం పాఠశాలలో చదివిన విద్యార్థుల రచనలన్నీ కలిపి తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ కాసర్ల నరేష్‌రావు పుస్తకంగా మలిచారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ అమర్‌నాథ్, ఉపాధ్యాయులు డాక్టర్ కాసర్ల నరేష్‌రావు, అహల్య, ప్రణీత, కవిత, అనిత, ఆరోగ్యరాజ్, వినోద్, దస్తగిరి, శ్రీపాద్, గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మణ్ రావు, అంకల గంగాధర్, దాసరి శ్రీధర్, పోతన, సాయికుమార్ పాల్గొన్నారు.

బీజేపీ కామారెడ్డి జిల్లా కమిటీ ఏర్పాటు

కామారెడ్డి టౌన్, జూలై 16: కామారెడ్డి జిల్లా బీజేపీ కమిటీని ఏర్పాటు చేసినట్లు జిల్లా అధ్యక్షురాలు అరుణతార మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా విఠల్, ప్రధాన కార్యదర్శిగా రాము, సెక్రెటరీలుగా క్రిష్ణపటేల్, పోతురాజ్ వెంకట్, కోశాధికారిగా బస్వారెడ్డి, గిరిజనమోర్చా అధ్యక్షుడిగా నవీన్‌నాయక్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లుగా రమేష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, గోలి శ్రీనివాస్, స్వరూప, మనోహర్‌రెడ్డి, పరశరాములు, రాజాగౌడ్, పద్మ, ముక్క సురేష్, నరేష్‌రెడ్డి, వెంకట్‌రావు, శ్రీనివాస్, దత్‌రావు, గంగాధర్‌రావు, హనుమండ్లు, భూమాగౌడ్, నర్సింహారెడ్డి, మల్లుదేశాయ్, బండి రాములు, రాజు పటేల్, కాసర్ల రవీందర్‌లతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విద్యుత్ అంతరాయంతో నిలిచిన రిజిస్ట్రేషన్లు

● ఇబ్బంది పడ్డ వినియోగదారులు

ఖిల్లా, జూలై 16: విద్యుత్‌కు అంతరాయం ఏర్పడడం వల్ల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. మంగళవారం ఉదయం 10గంటలకు మొదలు కావలసిన రిజిస్ట్రేషన్లు మధ్యాహ్నం 1గంట కావలసి వస్తున్న మొదలు కాలేదు. దీంతో రిజిస్ట్రేషన్లకు వచ్చిన వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కార్యాలయంలో కరెంట్‌కు అంతరాయం ఏర్పడినప్పుడు ప్రత్యామ్నాయంగా ఉన్న ఇన్వర్టర్ పని చేయకపోవడంతో వినియోగదారులు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఇన్వెర్టర్‌ను ఎందుకు మరమ్మత్తు చేయించలేదని ప్రశ్నించారు. ఒంటిగంటకు కరెంట్ రావడంతో సిబ్బంది పనులు మొదలు పెట్టారు. ప్రతి రోజు వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరిగే అర్బన్ కార్యాలయంలో సుమారు మూడు గంటల పాటు నిలచిపోవడంతో వినియోగదారులు సిబ్బంది పనితీరుపై మండిపడ్డారు.

ఒకరి ఆత్మహత్య

ఖిల్లా, జూలై 16: నగరంలోని 6వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల ఆటోనగర్‌కు చెందిన షేక్ మజీద్ (31) మద్యం మత్తులో యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మొగులయ్య తెలిపారు. మృతుడు ఎల్లప్పుడు మద్యం సేవించి ఉంటాడని అదే మత్తులో బాత్‌రూమ్ శుభ్రం చేసే మందును తాగి అపస్మారక స్థితిలో ఉండగా చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడు మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తాడని అన్నారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మొక్కలను పోషిస్తేనే హరితహారానికి గౌరవం

● కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ సెక్రెటరీ కరుణాకరన్

సదాశివనగర్, జూలై 16: నాటిన మొక్కలను పెంచి పోషిస్తేనే హరి తహారానికి గౌరవం దక్కుతుందని కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ సెక్రెటరీ కరుణాకరన్ అన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌లో అవెన్యూ ప్లాంటేషన్ ఈత వనాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ప్రభు త్వం వాతావరణ కాలుష్య నివారణ జరిగి ప్రజలకు మంచి ఆక్సిజన్‌తో పాటు చల్లని నీడను, మంచి ఫలాలు దక్కాలని హరితహారం వనమహోత్సవ కార్యక్రమాలను చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్, డీఆర్‌డీఏ ఏపీడీ పాల్గొన్నారు.


హెల్త్‌కార్డులను అందజేస్తున్న దృశ్యం

న్యాయవాదులకు హెల్త్‌కార్డుల అందజేత

నిజామాబాద్ లీగల్, జూలై 16: జిల్లా న్యాయవాదులకు బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌గౌడ్, అడ్వకేట్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యురాలు పరిపూర్ణారెడ్డి కోర్టు ప్రాంగణంలో మంగళవారం హెల్త్‌కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రతి న్యాయవాది ఆరోగ్యపరంగా ఎలాంటి ఆర్థిక ఇబ్బందులకు గురికావద్దనే లక్ష్యంతో రాష్ట్ర అడ్వకేట్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హెల్త్‌కార్డులను జారీ చేసినట్లు తెలిపారు. అనంతరం పరిపూర్ణారెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తినప్పుడు ఈ బీమా కార్డులు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలాగే హెల్త్‌కార్డులను రెన్యూవల్ చేయడం కూడా జరుగుతుందని ఆమె తెలిపారు. అనారోగ్యానికి గురైన వారికి రూ.2 లక్షల వరకు ఉచిత బీమా సౌకర్యం కల్పించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, కోశాధికారి దీపక్, కార్యదర్శి ధన్‌పాల్ సురేష్, న్యాయవాదులు రాజ్‌కుమార్ సుబేదార్, జి.తులసీదాస్, ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.


ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

● అక్కడికక్కడే ఒకరి మృతి.. ఆరుగురికి గాయాలు
● కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలో ఘటన


ప్రమాదంలో లారీ కిందకి దూసుకెళ్లిన కారు

భిక్కనూరు, జూలై 16: శుభకార్యానికి హాజరై తిరిగి తన కారులో స్వగ్రామానికి వెళ్తుండగా 44వ జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని వెనుకాల నుంచి ఢీకొట్టడంతో కారు నుజ్జునుజ్జై ఒకరు తీవ్రగాయాలతో అక్కడిక్కడే మృతి చెందగా కారులో ఉన్న ఆరుగురికి గాయాలైన సంఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన బ్రహ్మరౌత్ శివకుమార్ వర్మ(34) హైదరాబాద్‌లోని తన బావమరిది శ్రీకాంత్‌వర్మ ఇంట్లో జరిగిన శుభకార్యానికి తన భార్య రవళి, కుమారుడు శివానంద్, కూతురు ఆరాధ్య, స్నేహితులు కన్నుల అరుణ్(ముప్కాల్), మంతెన సాయిరెడ్డి(ముచ్చర్ల), బర్దవాల్ శివ కుమార్(గోరటికల్)తో కలిసి హాజరై తిరిగి స్వగ్రామం నిర్మల్‌కు వస్తుండగా మండలంలోని సిద్ధరామే శ్వరనగర్ గ్రామ శివారులోని సురేష్‌దాబా సమీపంలో ఆగిఉన్న లారీని వెనుకాల నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు లారీ కిందికి సగ భాగం వరకు వెళ్లగా కారులో ఇరుక్కుపోయి తీవ్రగాయాలై శివకుమార్‌వర్మ అక్కడిక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మృతుడి భార్య రవళి, కుమారుడు శివనాంద్, కూతురు ఆరాధ్య, స్నేహితులు అరుణ్, సాయిరెడ్డి, శివకుమార్‌కు గాయాలయ్యాయి. గాయపడిన వీరిని కామారెడ్డికి 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తరలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా గాయపడిన వారిని పరీక్షించిన వైద్యులు తీవ్రంగా గాయపడిన శివకుమార్‌ను మెరుగైనా చికిత్స కోసం హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. మృతుడి మామ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నుజ్జునుజ్జయిన కారు..


మృతి చెందిన శివకుమార్‌వర్మ

ఈ ప్రమాదంలో కారు లారీ కిందికి చాలా వరకు వెళ్లడంతో కారు సగ భాగానికి పైగా నుజ్జునుజ్జైంది. సమాచారం అందుకున్న పోలీసులు, జీఎంఆర్, 108 సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని కారులో వెనుక భాగంలో ఉన్న వారిని అతికష్టం మీద బయటకు తీయగా మృతుడు శివకుమార్ వర్మను చాలా సమయం వరకు బయటకు తీయడం సాధ్యం కాలేదు. దీంతో క్రేన్ సహాయంతో లారీ కింద ఇరుక్కుపోయిన కారును బయటకు తీసి కారులో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు.